



## మైనంపాటి భాస్కర్

# డీప్ ఫ్రీజ్



**అది** 2050 వ సంవత్సరం. ఏప్రిల్ ఫస్టు తారీఖు.

డాక్టర్ మిత్రా నర్సింగ్‌హోమ్‌లో యాభై మంది పేషెంట్లు ఉన్నారు. కానీ డాక్టర్ మిత్రా మాత్రం నర్సింగ్‌హోమ్‌లో లేడు. ఆయన నిశ్చింతగా క్లబ్బులో కూర్చుని కార్డ్సు ఆడుకుంటున్నాడు.

అక్కడ మిత్రాయే కాక, మరే డాక్టరూ లేడు ఆ పేషెంట్లని చూడడానికి.

కానీ పది మంది డాక్టర్లకి సమానమైన రోబోట్ అనే మర మనిషి ఉంది ఆ నర్సింగ్ హోమ్‌లో. (అసలు 'రోబోట్' అంటేనే వెట్టి చాకిరీ చేసేవాడు అని అర్థం). అద్భుతాలు చెయ్యగల ఫిఫ్త్ జెనరేషన్ కంప్యూటర్ ఉంది ఆ రోబోట్ బుర్రలో. ప్రోగ్రామ్ చేసి వదిలేస్తే, వందమంది పేషెంట్ల టెంపరేచర్, బ్లడ్ ప్రెషర్, హార్ట్‌బీట్ చూడడం దగ్గర్నుంచీ బి స్కేనర్స్ ద్వారా టోమోగ్రాఫ్ తీసి వ్యాధి నిర్ణయం చెయ్యడం దాకా అన్నీ తనే చూసుకోగలదు అది.

కుదురుగా ఒక కుర్చీలో కూర్చుని, ఫ్లానెల్ బట్టతో తన స్టీలు శరీరాన్ని తనే పాలిష్ చేసుకుంటూంది రోబోట్.


అప్పుడు హఠాత్తుగా దాని బుర్రలో ఉన్న సిలికాన్ చిప్స్ యాక్టివేట్ అయ్యాయి. అలర్టుగా లేచి నిలబడింది రోబోట్.

ఇవాళ ఏప్రిల్ ఫస్టు.

అంటే. . .

దాని తలలో ఉన్న మేగ్నటిక్ డిస్కుని ఒక లేజర్ కిరణం జ్ఞాపకాల కోసం తడిమింది.

అంటే. సరిగ్గా ఇప్పటికి ముప్పయ్ ఆరేళ్ళ క్రితం కేన్సరుతో చనిపోయి, డీప్ ఫ్రీజ్‌లో ఉంచబడిన కేశవరావు శవంలో హృదయ స్పందనా, రక్త ప్రసరణా



శ్వాసక్రియా సక్రమంగా తిరిగి మొదలయ్యేలా చూసి జీవం తెప్పించాలి! ఆ తరవాత యాంటి కేన్సరు డ్రగ్ ఇవ్వడం మొదలెట్టాలి. డాక్టర్ మిత్రా ఆ మందు కనిపెట్టి వారం రోజులే అయింది.

యాంత్రికంగా నడుస్తూ టెలిఫోనిక్ విజన్ దగ్గిరికి వెళ్ళి, మీటనొక్కింది రొబోట్. టెలిఫోన్‌కి అమర్చి ఉన్న స్క్రీన్ ప్రకాశవంతంగా అయింది. డాక్టర్ మిత్రా కనబడ్డాడు అందులో.

''ఎస్?'' అన్నాడాయన.

''డీప్ ఫ్రీజ్ సెల్ నంబర్ త్రీ జీరో త్రీ. కేశవరావు బాడీని బతికించి యాంటికేన్సర్ డ్రగ్ ఇవ్వాల్సింది ఇవ్వాళే'' అంది రొబోట్. వీణా, ఫ్లూటూ, క్లారినెట్ కలిసినట్లుంది దాని కంఠస్వరం.

''ప్రొసీడ్'' అన్నాడు డాక్టర్ మిత్రా. తరవాత 'షో' చెప్పే కార్డ్సు బల్లమీద పడేసి, పక్కగా ఉన్న సోఫా ఒకదానిలో కూర్చుని విశ్రాంతిగా సిగరెట్ అంటించాడు. ముప్పయ్ అయిదేళ్ళ క్రితం కేశవరావు మరణించిన చిత్రమైన పరిస్థితులు అతనికి గుర్తొచ్చాయి.

• • • •

కేశవరావు మామూలు మధ్య తరగతి మనిషి. ఆహారం మింగడం అతనికి ఇబ్బందిగా ఉండేది. అందుకని డాక్టర్ మిత్రా దగ్గర ట్రీట్‌మెంట్‌కి వెళుతూ ఉండేవాడు. వారం రోజులయినా తగ్గక పోయేసరికి బయాప్సీ చేసి చూశాడు మిత్రా. కేన్సరు టెర్మినల్ స్టేజి ఈ సంగతి పేషెంటుతో చెప్పడమా? మానడమా?

మెడికల్ రిపోర్టు చూస్తూ ఆలోచనలో ఉండగా సంభ్రమంగా వచ్చాడు కేశవరావు.

''ఇది చదవండి డాక్టర్!'' అంటూ ఆనందంగా ఒక ఉత్తరం అందించాడు. సందేహంగా అందుకుని చదివాడు మిత్రా. అది ఒక కోర్టు నుంచి వచ్చింది.

''మీకు వరసకి మేలు విడిచిన మేనత్త గారయే శ్రీమతి మంగళాంబగారు వారసులు లేకుండా పరమ పదించడం వల్ల ఆమె తాలూకు ముప్పై లక్షల రూపాయల ఎస్టేటూ మీకు సంక్రమిస్తుంది. స్వాధీన పరచుకోగలరు.''

''చెప్పండి డాక్టర్! నా కంటే అదృష్టవంతుడు ఉంటాడా ఈ లోకంలో! నా గొంతునొప్పి ఒక్కటి తగ్గరచారంటే మీకు సగం లక్ష ఇచ్చేస్తాను'' అన్నాడు కేశవరావు ఆనందాతిరేకంతో.

చావు కబురు చల్లగా చెప్పాల్సిన సమయం ఇదేనని నిశ్చయించుకున్నాడు మిత్రా.

''సారీ కేశవరావుగారూ! మీ గొంతు నొప్పి తగ్గేది కాదు. కేన్సరు వచ్చింది. సరిదిద్దుకోవలసిన వ్యవహారాలూ, సంతకాలూ అవీ త్వరగా ముగించేసుకోండి. ఇంక రెండు మూడు నెలల కంటే ఎక్కువ వ్యవధి ఉంటుందనుకోను'' అన్నాడు సానుభూతిగా.

నిశ్చేష్టుడై పోయి, వెర్రివాడిలా చూశాడు కేశవరావు. ఇదేనా దేవుడి లీల అంటే! ఎంత దుర్భరమైన పరిస్థితి ఇది! ఎక్కడో మారుమూల క్రీనీడలో కదలని ఫైళ్ళ మధ్య చెదపురుగులా అల్పమైన బతుకు బతికేస్తున్న ఈ గుమాస్తా కేశవరావుగారికి హఠాత్తుగా ముప్పై లక్షల ఆస్తి కలిసి రావటమా? లక్షాధికారి అయిన సంబరం తీరీ తీరక ముందే భయంకరమైన జబ్బుతో ఈ కేశవరావుగాడు ఉత్త ''శవరావు'' అయిపోవటమా!

ఎప్పుడో ఒక్కసారి గుక్కెడు బీరు తాగినా హరాయించుకోలేని ఈ అల్పుడికి అమృతమూ హాలాహలమూ కలిపి కాక్‌టెయిల్ చేసి తాగిస్తున్నావా భగవంతుడా!

ఒక కాలు మంచు మీదా, మరో కాలు మంటల్లో పెట్టి నిలుచుంటే ఎలా ఉంటుంది? ''యావరేజి''న సమశీతోష్ణంగా, హాయిగా ఉంటుందని చెబుతారేమో సైంటిస్టులు!

''హుఁ! సైంటిస్టులు! ఇంతమంది ఉన్నారు. ఎందుకూ? కేన్సరుకి సరైన మందు కనిపెట్టలేక పోయాక!

''కేన్సరుకి ఇంతవరకూ సరైన మందు లేదు— నిజమే! కానీ ఒక పద్ధతి ఉంది'' అన్నాడు మిత్రా ''క్రైయోజెనిక్స్ అనే పేరు విన్నారా మీరు?''

లేదన్నట్టు నిస్పృహగా తల ఆడించాడు కేశవరావు.

''ఇప్పుడు మందులేని వ్యాధులతో చనిపోయిన వారి శవాలని చెడిపోకుండా భద్రపరచి భవిష్యత్తులో సరైన చికిత్స కనుక్కున్నప్పుడు దాన్ని ఆ శవాల మీద ప్రయోగించడం క్రైయోజెనిక్స్ అనే ప్రక్రియ ద్వారా సాధ్యం.''


నోరు తెరుచుకుని చూస్తున్నాడు కేశవరావు.

డాక్టరు మళ్ళీ చెప్పడం మొదలెట్టాడు:

క్రైయోజెనిక్స్ అంటే వ్యావహారిక భాషలో దాదాపు రిఫ్రిజిరేషన్ లాంటిదని చెప్పుకోవచ్చు. ఈ క్రైయోజెనిక్స్ మీద దాదాపు 1626 నుంచీ ప్రయోగాలు జరుగుతున్నా, శరీరంలోని అతి ముఖ్యమైన జీవకణాలూ మెదడులోని సున్నితమైన టిష్యూలూ పాడై పోకుండా ఉంచడం దుర్లభంగా ఉండేది. ఇన్నాళ్ళూ పొగమంచు స్థితిలో ఉండే నత్రజని ఉపయోగించి శవాలని శాశ్వతంగా యథాతథంగా భద్రపరచే పద్ధతి కనుక్కున్నాను నేను'' అన్నాడు. అతని పెదిమల ఒంపులో కొద్దిగా గర్వం తొంగి చూసింది.

సృష్టి, స్థితి, లయకారకులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులని పక్కకి తప్పుకోమని వాళ్ళ డ్యూటీలు తను లాగేసుకుంటున్నాడు.

తను! మనిషి!




డాక్టరు చెబుతున్నది బుర్రకెక్కుతున్న కొద్దీ కేశవరావు మొహంలో ఆశ చోటు చేసుకుంటూంది.

''నా నర్సింగ్‌హోమ్‌లోనే ఇలాంటి డీప్ ఫ్రీజ్ సెల్ ఏర్పాటు చేస్తున్నాను. కొద్దిగా ఖర్చు ఎక్కువే అయినా మీ రిప్పుడు లక్షాధికారులు కాబట్టి సులభంగానే తట్టుకోగలరు. పదేళ్ళతరవాతో పాతికేళ్ళ తరవాతో కేన్సరుకి తిరుగులేని మందు కనిపెట్టినప్పుడు, మళ్ళీ మీ శరీరంలో కృత్రిమంగా యాంత్రిక సహాయంతో శ్వాసక్రియా, రక్త ప్రసరణా జరిగేలా చేసి, ఆ తరవాత ఆ మందు మీమీద ప్రయోగిస్తాము. ఎప్పుడో ఒకప్పుడు మీరు తిరిగి బతికి వస్తారు. ష్యూర్ థింగ్!'' అన్నాడు డాక్టరు నిశ్చయంగా.

* * * *

అదంతా గుర్తుకు తెచ్చుకుని చిరునవ్వు నవ్వుకున్నాడు మిత్రా. ఆ సంఘటన జరిగిన తరవాత ముప్ఫయిఅయిదేళ్ళు గడిచిపోయాయి. కేన్సరుకి అద్భుతమైన మందు కనుక్కున్నారు శాస్త్రజ్ఞులు.

దీనితో పాత మొండి జబ్బులన్నీ మనిషికి లొంగినట్టే.

కానీ పాత జబ్బులు పోయినా, వెర్రితలలు వేసిన నాగరికత వల్ల సరికొత్త జబ్బులు పుట్టుకొస్తున్నాయి. శబ్ద కాలుష్యం వల్ల చెముడూ, వాతావరణ కాలుష్యం వల్ల కొత్తరకం అలర్జీలూ సర్వసాధారణమైపోయాయి. కొత్త జబ్బులని నివారించడానికి కొత్త ప్రయోగాలు చేస్తున్నారు.

దీనికి అంతం లేదు.

* * * * *

అక్కడ నర్సింగ్‌హోమ్‌లో —

కృత్రిమ శ్వాసకోసం కృత్రిమమైన గుండె కేశవరావు శవానికి కనెక్ట్ చేసి స్విచ్ ఆన్ చేసింది రాబోట్.

శవం బతకడానికి కవుంట్‌డవున్ మొదలయింది.

పది సెకెండ్లు ఆరు ఐదు నాలుగు మూడు రెండు ఒకటి.

శవం ఒక్కసారి పళ్ళు గిట్టకరిచి, గజగజ వణికింది. తరవాత భారంగా మూలిగి, మొత్తం గదిలోని గాలినంతా పీల్చేసుకుంటున్నట్టు అతి దీర్ఘంగా శ్వాస తీసుకుంది.

కేశవరావుకు ముప్పయ్యేళ్ళ తరవాత అది మొదటి శ్వాస! చిన్నగా రోదన లాంటి శబ్దం గొంతులోనుంచీ వెలువడింది. ధమనుల్లో రక్తం సంకోచంగా ప్రవహించడం మొదలెట్టింది. మెదడులోని జీవకణాలు ఒక్కొక్కటే మేలుకున్నాయి.

అప్పుడు యాంటీ కేన్సరు డ్రగ్ ఇచ్చింది రాబోట్. అలా గంటకి ఒకసారి చొప్పున నాలుగు డోసులు ఇచ్చింది.

మెల్లిగా కళ్ళు తెరిచాడు కేశవరావు. తనెక్కడ ఉన్నాడో చప్పున అర్థం కాలేదు. వేలరోజుల క్రితం ఫ్రిజ్‌లో పెట్టి మరిచిపోయిన తోటకూరకాడలా ఉంది దేహస్థితి!

"గుడ్‌మార్నింగ్!" అంది రాబోట్ యాంత్రికంగా.

ఉలిక్కిపడి చూశాడు కేశవరావు. ఎదురుగుండా మిలమిల మెరుస్తూ — స్టీలు దయ్యంలా ఏమిటిది?

"నేను మనిషిని కాను—భయపడకండి! నేను మెషిన్ని, రాబోట్‌ని!" అంది రాబోట్. అతను నిర్విణ్ణుడయి చూస్తుండగానే లేసర్ కిరణాలతో హోలోగ్రాం తీసింది. ఎక్స్‌రేలో కేవలం పొడుగూ, వెడల్పూ మాత్రమే కనబడితే, హోలోగ్రాంలో లోతుకూడా కనబడుతుంది.

కేశవరావుని టెలిఫోనిక్ విజన్ పరిధిలోకి తీసుకొచ్చి మీట నొక్కింది రాబోట్. డాక్టర్ మిత్రా మొహం కనబడింది.

"శవం బతికింది" అంది రాబోట్.

"వెల్‌డన్! ఏదీ! చూడనియ్!" అంటూ క్లబ్బులో కూర్చునే కేశవరావు కండిషన్‌ని చెక్ చేశాడు. కేశవరావు గుండె చప్పుడు వినబడుతూంది. అతని శ్వాసలో ఉన్న కొద్ది గురగుర వినబడుతూంది.

"కంగ్రాట్స్! మీరు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నారిప్పుడు. ఇంకో గంటలో నేను వచ్చాక మిమ్మల్ని ఇంటికి పంపేస్తాను!" అన్నాడు డాక్టరు.

మరో గంట తరవాత రాబోట్ కేశవరావుకి యాంటిసెప్టిక్‌లో ముంచి తీసిన బట్టలు తొడిగింది. తలకి ఆక్సిజన్ మాస్కూ, చెవులకి శబ్దం సోకకుండా ఫిల్టర్సూ అమర్చింది.

"ఇవన్నీ ఎందుకు?" అని అడగబోయేంతలోనే సూర్యరశ్మితో నడిచే సోలార్ కారులో ఉన్నాడు కేశవరావు. స్విచ్ ఆన్ చేసి చెయ్యగానే అతివేగంతో పోవడం మొదలెట్టింది అది.

రోడ్డు పక్కనే ఉన్న ఫుట్‌పాత్ కన్వేయర్ బెల్టులా కర్ణ కఠోరంగా శబ్దం చేస్తూ ముందుకు జరిగిపోతోంది. దాని మీద నిలబడి ప్రయాణం చేస్తున్నారు జనం!

జనం! ఎక్కడ చూసినా జనమే!

"మందలుమందలుగాదగ్గరదగ్గరగాఆనుకుంటూతోసుకుంటూఉన్నారుజనం."

పై వాక్యంలోని అక్షరాలు ఎంత ఇరుకిరుగ్గా, మధ్యలో కామా అయినా పెట్టడానికి కాస్త ఖాళీ అయినా లేకుండ ఎలా ఉన్నాయో, అలా కిటకిటలాడుతున్నారు జనం! జనాభా అప్పటికి మూడువేల కోట్లు అయింది. చీమలపుట్ట పగిలినట్లుంది భూగోళం!

నాగరికత బలిసిపోయింది. ఎక్కడ చూసినా ఫ్యాక్టరీలూ, పొగగొట్టాలూ, అవి కక్కుతున్న విషవాయువులూను! పొగా, పొగమంచూ, విషవాయువులూ కలిసి గాలి చిక్కగా ఉంది. ఆకాశంలో గద్దల గుంపుల్లా ఎగురుతున్నాయి విమానాలు. వీటన్నింటివల్లా భరించలేనంత శబ్దం జనిస్తోంది. మానవ శ్రవణేంద్రియం దాదాపు ఎనభై డెసిబుల్స్ దాకా శబ్దాన్ని భరించగలగగా, ఆ శబ్దం రెండొందల నలభై డెసిబుల్స్‌ని దాటింది.

ఇంతలో రోడ్డు మీద ఎవరో ఒకతనికి మొహం మీద ఉన్న ఆక్సిజన్ మాస్కు జారిపోయింది. చెవులకి ఉన్న ఫిల్టర్లు వూడి పడిపోయాయి. వాతావరణంలోని విషవాయువులని పీల్చిన వెంటనే అతను వెర్రికేక వేసి విరుచుకు పడిపోయాడు. భరించలేని ఆ శబ్దాలకి అతని గూబ పగిలిపోయి చెవుల్లోనుంచి రక్తం కారడం మొదలు పెట్టింది. కొద్ది క్షణాలు గిలగిల తన్నుకుని ప్రాణాలు వదిలాడతను.

భయభ్రాంతుడై చూశాడు కేశవరావు.

కొద్ది నిమిషాల తర్వాత ఇంటి ముందు ఆగింది సోలార్ కారు. గుర్తు పట్టలేనంతగా షేపు మారిపోయింది ఇల్లు! అంతా ఫైబర్ గ్లాస్! ఇంటిముందు జానెడు స్థలం కూడా లేదు. ఎక్కడా మొక్కా మోడూ, చివరికి పచ్చిగడ్డి కూడా లేదు! బయటి గాలీ, శబ్దమూ ఇంట్లో చొరబడకుండా ఇల్లంతా సౌండ్ ప్రూఫ్, ఎయిర్‌కండిషన్డ్! అది అత్యవసరం!

సందేహంగా ఇంట్లోకి వెళ్ళగానే హాల్లో మరో రాబోట్ కనబడింది. డొమెస్టిక్ రాబోట్ అది. "సేవక్" మోడలు. హాస్పిటల్ రాబోట్ అంత ఆధునికమైన, ఖరీదైన మోడల్ కాదది. దానిలో మాట్లాడే సౌకర్యం లేదు. తను చెప్పాలనుకున్నది ఒక టేప్ మీద ప్రింట్ చెయ్యగలదు. అంతే!


హాస్పిటల్ రాబోట్ ఇల్లు వూడుస్తున్న సేవక్ రాబోట్ దగ్గరికి వెళ్ళింది. దాని నోట్లోనుంచీ పొడవాటి నాలుకలా 'డెలివరీ స్లిప్' ప్రింట్ అయి వచ్చింది. అది అందుకున్న సేవక్ రాబోట్ కడుపులోనుంచి రిబ్బన్‌లా కాగితపు టేపు బయటికి వచ్చింది. కేశవరావుని 'డెలివరీ' తీసుకున్నట్లు రసీదు అది!

హాస్పిటల్ రాబోట్ 'థాంక్యూ!' అంది.

సేవక్ రాబోట్ "డోన్ట్ మెన్షన్" అని ప్రింట్ చేసింది గానీ దాన్ని పట్టించుకోకుండా వెళ్ళిపోయింది హాస్పిటల్ రాబోట్.

అంతలో ఒక పిల్లవాడూ, తల్లీ వచ్చారు హాల్లోకి. "ఏం తోచట్లేదు మమ్మీ! ఏంచెయ్యనూ" అంటూ మారాం చేస్తున్నాడు పిల్లవాడు.

"పక్కింటి కెళ్ళి వాళ్ళ టాకింగ్ రాబోట్‌తో ఆడుకో లలిత్! నీకు కథలూ అవీ చెప్పి చెస్ కూడా ఆడుతుంది. మన రాబోట్టూ ఉంది ఎందుకూ? బ్యాటరీ దండగ! ఇన్‌స్టాల్‌మెంట్‌ల మీదైనా కొత్త రాబోట్ కొందామంటే మీ నాన్నగారు పట్టించుకోరే! పక్కింటావిడ బోడి గొప్ప చూసినప్పుడల్లా నాకు తల కొట్టేసినట్లుంటుంది" అంది మమ్మీ సుధీర.



"పాపం! తిట్టకు మమ్మీ!" అన్నాడు లలిత్ స్నేహంగా రాబొట్ మీద చెయ్యేస్తూ.

"ఎవర్నిరా తిడుతోంది మీ అమ్మ?" అంటూ వచ్చాడు ఒక వయసు మళ్ళిన ఆయన.

"ఎవరీయన? ఎక్కడో చూసినట్లుందే ... వోరినీ ... వీడు మధు కదూ? తన కొడుకు కదూ? ఇంత ముసలాడై పోయాడేమిటి? అయితే ఆవిడ తన కోడలా? వీడు ... వీడు తన మనవడా!

"ఎవరదీ?" అంది ఒక ముసలావిడ రంగ ప్రవేశం చేస్తూ, కేశవరావుని ఉద్దేశించి.

అందరూ తిరిగి చూశారు. పాతకాలపు ఫోటోలా గోడకి ఆనుకుని నిల్చుని ఉన్నాడు కేశవరావు.

"నేన్రా! నేను! కేశవరావుని!" అంటాడు తను. అనగానే అందరూ కోలాహలంగా చుట్టుముట్టే స్తారు తనని. వెంటనే వాళ్ళందరి కళ్ళలో ఆనందాశ్రువులు నిలుస్తాయి.

"నేను! నేన్రా! కేశవరావుని!' అన్నాడు, గొంతు రుద్ధమై పోతుండగా.

వెంటనే అందరూ దయ్యాన్ని చూసిన వాళ్ళలా నిశ్చేష్టులై పోయారు. ఆశ్చర్యం, అనుమానం, అదుర్దా వాళ్ళ మొహాల్లో చోటు చేసుకున్నాయి.

కానీ ... కానీ ... తను ఆశించినట్లు ఒక్కరి మొహంలో కూడా ఆనందం కనబడలేదు.

"మీరు ... మీరు ..." అంటోంది పార్వతి సందిగ్ధంగా.

అనుమానంగా తన వైపు చూసుకున్నాడు కేశవరావు. తను ముప్పై అయిదేళ్ళ క్రితం ఎలా ఉన్నాడో ఇప్పుడూ అలాగే ఉన్నాడు. జుట్టు పూర్తిగా నెరవలేదు. ఒళ్ళు రాలేదు.

కానీ —తన భార్య తల ముగ్గు బుట్ట అయి పోయింది. తన కొడుక్కి పూర్తిగా బట్టతల వచ్చేసింది. చివరికి తన కోడలు కూడా తనకంటే పెద్దదానిలాగే కనబడుతోంది.

ఇంతలో —

ఇంటిముందు సోలార్ టాక్సీ ఒకటి ఆగింది. అందులోనుంచి కేశవరావు అల్లుడు చిట్‌బాబ్, కూతురు నళిని దిగారు. సూట్‌కేసులోనుంచి నోట్ల కట్ట ఒకటి తీసి టాక్సీ డ్రైవరు చేతిలో పెట్టాడు చిట్‌బాబ్. ఆ నోట్లకట్టని హీనంగా చూసి, మరో అయిదు వే లిమ్మన్నాడు డ్రైవరు.

"ఏడు వేలకు మించి ఒక్క పెయ్యి కూడా ఎక్కువ ఇవ్వ"న్నాడు చిట్‌బాబ్.

"ఇలా పెయ్యి పెయ్యి కూడబెట్టి నా పేరు మీద చొక్కా కుట్టించుకో!" అని తల బిరుసుగా సమాధానం చెప్పి, ఏడు వేలు తీసుకుని వెళ్ళి పోయా డతను.

"ఎవరీయన?" అన్నాడు ఆయన అల్లుడు, కేశవరావుని చీదరగా చూస్తూ.

"మా నాన్నగారు...ట!" అన్నాడు మధు ఇబ్బందిగా.

"రాబొట్! సూట్‌కేసూ, సామాన్లూ లోపల పెట్టు!" అంది పార్వతి. రాబొట్ కదలకుండా బొమ్మలా అలా నిలబడే ఉంది. అది ఈ మధ్య తరుచుగా ట్రబులిచ్చి ఆగిపోతూంది.

"డొక్కు రాబొట్ ట్రబులిచ్చినప్పుడు డొక్కలో తంతే మళ్ళీ కదులుతుంది" అంటూ కేశవరావు మీది కోపమంతా దాని మీద చూపిస్తూ కాలితో తన్నాడు చిట్‌బాబ్.

నడుం విరిగినట్లు ఒక్కసారి కింద పడి, మళ్ళీ బంతిలా లేచి సామాన్లు అందుకుంది రాబొట్.

ఇబ్బందికరంగా ఉన్న ఆ పరిస్థితిని తప్పించుకోవ డానికి తను కూడా లోపలికి వెళ్ళిపోయింది పార్వతి. ఆమె మనసులో వెయ్యి రకాల అనుమానాలు! తన కంటె వయసులో సగం ఉన్నట్టు కనబడుతున్న ఆయన నిజంగా ఆయనేనా? పోనీ నిజంగానే ఆయన శరీరం తిరిగి బతికుందనుకున్నా అందులో ఉన్నది ఆయన ఆత్మేనని రుజువేమిటి? మరొకడి ఆత్మ ఈయన శరీరంలో దూరలేదని భరోసా ఏమిటి?

ఆమె మనసు అల్లకల్లోలమయి పోయింది. పరధ్యానంగానే రాబొట్‌ని వంటకు ప్రోగ్రామ్ చేసింది పార్వతి. అరగంటలో వంట ముగించింది రాబొట్. అందరూ భోజనాలకి కూర్చున్నారు.

ఆ వడ్డించిన పదార్థాలు ఏమిటో అర్థం కాలేదు కేశవరావుకి. గడ్డి తింటున్నట్టే అని పించింది.

అతని మొహంలో భావం చూసి నవ్వాడు చిట్ బాబ్. "అది సింథెటిక్ పీచూ, ప్రొటీనూ కలిపి చేసిన పౌష్టికాహారం! ఏం? నచ్చలేదా?" అన్నాడు.

పెరుగుతున్న జనాభాతో సమంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరగక పోవడం వల్ల సింథెటిక్ ఆహార పదార్థాలు కనిపెట్టక తప్పని పరిస్థితి వచ్చింది.

"బియ్యపు అన్నం, కూరలూ ఎప్పుడో వండ గలకి తప్ప చేసుకోవడం మానేశారు జనం! ఏం బావ గారూ! మీ నాన్నగారు బతికి వచ్చారు కదా, ఇవాళైనా వరి అన్నం వండించకపోయారూ?" అన్నాడు చిట్‌బాబ్, తనకి మర్యాదలు సరిగ్గా జరగలేదనే విషయాన్ని పరోక్షంగా చెబుతూ.

"బియ్యం కిలో అయిదు వేలట" అన్నాడు మధు నీరసంగా. "రాత్రికి చేయిద్దాం."

అప్పుడు మొదటిసారిగా తట్టింది కేశవరావుకి డబ్బు విలువ ఇంత దారుణంగా పడిపోతే ఇంక తన ముప్పై లక్షల ఆస్తికి విలువేముంటుంది అని.

అదే అడిగాడు.

"ఆస్తిని అందరం కలిసి జాయింటుగా బిజినెస్‌లో పెట్టాం. అది అయిదు కోట్లుంటుంది ఇప్పుడు" అన్నాడు మధు సీరియస్‌గా. తండ్రి డబ్బు ప్రస్తావన తెస్తాడని అతనికి తెలుసు. తండ్రి బతికి రావడం వల్ల తమ కుటుంబానికొచ్చే లీగల్ కాంప్లి కేషన్ ఏమిటో కూడా తనకి తెలుసు! అతను లాయరు.

"నా ఆస్తి పది కోట్లా!" అన్నాడు కేశవరావు ఆనందాతిరేకంతో.

"మీ ఆస్తా?" అన్నారు మధు, చిట్‌బాబ్ ఇద్దరూ జంటకవుల్లా.

అంతే! ఆ ఒక్క ప్రశ్నతో కేశవరావుకి ఆ ఇంట్లో తన స్థానమేమిటో అన్న సందేహానికి జవాబు దొరికింది.

● ● ● ●


ఆ రాత్రికి కేశవరావు నిద్రపోయాడని నిర్ధారించు కున్నాక అందరూ హాల్లో చేరారు.


వాస్తవానికి కేశవరావు నిద్రపోలేదు. కానీ అతన్ని చూస్తే శాశ్వత నిద్రలో ఉన్నాడని భ్రమ పడతారు ఎవరైనా! శవంలా పడి ఉండడం కేశవ రావుకి ముప్పయి అయిదేళ్ళ అలవాటు!

హాల్లో గుసగుసగా చర్చ మొదలయింది.

"నా కంటే కుర్ర వెధవలా ఉన్నవాణ్ణి పట్టుకుని నాన్నా, నాన్నా అనడం నాకు మహా ఇబ్బందిగా ఉంది!" అన్నాడు మధు.

"ఆజాలాయి చూపూ, వెకిలి నవ్వూ చూస్తుంటే ఏ రవుడీ వెధవగాడి ఆత్మో ఆ శరీరంలో దూరినట్లు అనిపిస్తూంది గానీ, మీ నాన్నగా కనిపించడం లేదురా!" అంది పార్వతి.





11--5—83

"పైగా 'నా ఆస్తి, నా ఆస్తి' అంటారేమిటి మీ నాన్న? చచ్చిపోయిన వాడు మళ్ళీ బతికొస్తే ఆస్తిమీద హక్కు ఉంటుందా? ఇంత పెద్దలాయనై ఉండి నోరెత్తరేమండీ?" అని గదమాయించింది మధు భార్య, సుధీర.

"ఎలాగైనా ఆలోచించి ఈ పీడని నువ్వే వదిలించాలి!" అన్నాడు చిట్‌బాబ్, పళ్ళు విప్పి పోయుంగా.

"ఆలోచనా! కంప్యూటర్లూ రోబొట్లూ వచ్చాక మెదడుకి పని తగ్గి మొద్దుబారిపోయి ఆలోచించడం అలవాటే తప్పిపోయింది. ఆఁ! ఉండు! మన రోబొట్ కొత్తదిగా ఉన్నప్పుడు దీనికి చాలా లీగల్ పాయింట్లు ఫీడ్ చేసి పని చేయించుకున్నాను. ఇప్పుడు మన పాయింట్లన్నీ దానికి ఫీడ్ చేస్తే పీడా వదిలే పద్ధతి చెపుతుంది అది!" అంటూ రిమోట్ కంట్రోల్ స్విచ్ నొక్కాడు మధు.

"సర్లెండి మీ రోబొట్టూ మీరూను! ఇవాళ్లో, రేపో అన్నట్లుంది అది!" అంది సుధీర దెప్పి పొడుస్తూ.

బలహీనంగా అడుగులో అడుగేసుకుంటూ వచ్చింది రోబొట్.

అందరూ గొడవ గొడవగా తలో పాయింట్ చెప్పారు దానికి.

"ఆయన శరీరంలో ఉన్న ఆత్మ ఆయనదేనని ఏమిటి నమ్మకం?" అంది పార్వతి.

"చావుకి మెడికో లీగల్ డెఫినిషన్ ఏమిటి? హృదయ స్పందనా, రక్త ప్రసరణా, శ్వాసక్రియా ఆగిపోవడమేనా? చచ్చిపోయిన మనిషి బతికి రావడాన్ని 'లా' ఒప్పుకుంటుందా?" అన్నాడు మధు.

"బతికి రావడాన్ని 'లా' ఒప్పుకున్నా ఆయనకి ఆస్తిమీద హక్కుని ఇస్తుందా?" అంది సుధీర.

"ఈ ముప్ఫయ్ అయిదేళ్ళలో ఆయన వయసు పెరిగినట్లా, పెరగనట్లా?" అన్నాడు చిట్‌బాబ్.

"పెరక్కపోతే ఆయన కంటే ఆయన పిల్లలు పెద్దవాళ్ళయిపోరా? ఆయన కంటే ఆయన కొడుకే పెద్దవాడై పోతే హిందూ అన్‌డివైడెడ్ ఫామిలీ లా ప్రకారం గృహానికి యజమాని ఎవరు? కర్త ఎవరు? మనువు ఏమంటాడు?" అన్నాడు మధు.

ప్రశ్న! ప్రశ్నమీద ప్రశ్న! ప్రశ్నమీద ప్రశ్న మీద ప్ర. . .

ఆ ప్రశ్న లన్నిటికీ అంతరార్థం ఒక్కటే!

అంతర్ధానమై పోయా డనుకున్న మనిషి మళ్లీ తిరిగి వస్తే ఆయన ఆస్తి మీద తమకి ఉన్న హక్కు పోతుందా? ఆయన లేకుండానే బతకడానికి అలవాటుపోయిన జీవన సరళిలో బలవంతపు మార్పు వస్తుందా

రోబొట్ "మెదడు" వేడెక్కి పోయింది. ఆ మెదడులో నరం లాంటి సన్నిటదైన వైరు ఒకటి తెగింది.

రోబొట్ సమాధానం కోసం చూసి చూసి విసుగెత్తిపోయారు అందరూ. "ఇదింక లాభం లేదు. రేపు మా ఆఫీసులో కంప్యూటర్‌ని అడిగితే సొల్యూషన్ దొరుకుతుంది" అన్నాడు మధు.

ఎవరి దారాల్లో చింతలు వాళ్ళు రగ్గుల్లా కప్పుకుని నిద్రలోకి జారిపోయారు.

రోబొట్ బుర్రలోని మేగ్నటిక్ డిస్క్‌ని జ్ఞాపకాల కోసం తడుము తూంది లేసర్ కిరణం. సేవలు చేసిచేసి పాతబడిపోయిన తనని అందరూ చీదరించుకునే వారే పసివాడు ఆ లలిత్ తప్ప!

తనలో తనకే తెలియని చలనం వచ్చి లలిత్ కోసం వెదకడం మొదలెట్టింది రోబొట్. లలిత్‌ని ఒక్కసారి చూడాలి!

ఆసమయంలో లలిత్ కేశవరావు ఒడిలో కూర్చుని ఉన్నాడు.

"ఐ లైక్ యూ తాతయ్యా! వూఁ! ఇంకా నీ చిన్నప్పటి జోకులు చెప్పు! సినిమాలు గొర్రెల మందల్లా సినిమా హాళ్ళలో కూర్చుని చూసేవారా? వీడియోలు ఎక్కడో తప్ప ఉండేవి కావా? కార్లని పెట్రోలుతో నడిపించే వార్లా? నువ్వు భలే నవ్వించే జోకర్‌వి తాతయ్యా!" అంటూ నవ్వుతున్నాడు లలిత్. ఆ పసి మనసుకి మనిషి తాలూకు మసి ఇంకా అంటుకోలేదు.

తలుపు తెరుచుకుని రోబొట్ వచ్చింది.

"మన రోబొట్ వచ్చింది తాతయ్యా! కమాన్ రోబొట్! కమాన్!" అన్నాడు లలిత్ స్నేహంగా.

రోబొట్ విశ్వ ప్రయత్నం మీద రెండడుగులు వేసి, లలిత్ చెయ్యి అందుకుని, తరవాత కుప్పలా కూలిపోయింది.

మనిషి కల్మషాన్ని జీర్ణించుకోలేక, కడుపులో ఉన్నది కక్కేస్తున్నట్లు చాలా సింబాలిక్‌గా దాని కడుపులో నుంచి ఒక కాగితపు రోల్ బయటికి వచ్చేసింది. తరవాత నిశ్చలంగాఅయిపోయింది రోబొట్.

వణికే చేతులతో అది అందుకుని చూశాడు కేశవరావు. తన కుటుంబ సభ్యులు కక్కిన విషమంతా దాని మీద నలుపు రంగులో ప్రింటయి ఉంది.

కేశవరావు మొహం వివర్ణమయింది.

డబ్బు! డబ్బు! డబ్బు!

డబ్బు తప్ప మరేమీ అక్కర్లేదు ఈ మనుషులకి, అయినా ఎవడబ్బ డబ్బనీ వీళ్ళు తన సొమ్ముని బాబుగాడి ముల్లెలా అనుభవిస్తూ షోకు చేస్తున్నారు? తను బతికి రాగానే, తనని గోడ దూకి టెరిటరీలో చేరిన వాడిని చూసినట్లు చూస్తారా!

మమతలూ, మమకారాలూ, మానవత్వం అంతా మిథ్య! స్వార్థం ఒక్కటే నిత్యమైన సత్యం!

ఈ మనసులు లేని 'పసివాడు' అనే వాడే లేడు ఈ ఇంట్లో!

నిస్సహాయంగా లలిత్‌ని దగ్గరగా పొదువుకున్నాడు కేశవరావు.

తెల్లవారగానే టెలిగ్రామ్ ఒకటి రెడీగా ఉంది కేశవరావు కోసం.

"మీ మేనత్త మంగళాంబగారు కేన్సరుతో చనిపోయినప్పుడు ఆమె శరీరాన్ని డీప్‌ఫ్రీజులో ఉంచడం జరిగింది. ఆమె మొన్న బుధవారం నాడు తిరిగి బతికారు. మీరు స్వాధీనం చేసుకుని ఇన్నాళ్ళూ అనుభవించిన ఆస్తిని తిరిగి ఆమెకి అప్పగించాల్సిందిగా కోరుతున్నాను.

—అడ్వొకేటు."

అది చదవగానే కుప్పలా కూలిపోయాడు కేశవరావు. అతని మనసు రంకె లెయ్యడం మొదలెట్టింది.

"ఏమిటీ! ఆ చచ్చిపోయిన మనిషి మళ్ళీ బతికొచ్చిందా? ఎందుకు? బతికి ఎవర్ని ఉద్ధరించను? ఇప్పుడు ఇన్నాళ్ళ తరవాత మళ్ళీ తన ఆస్తి తనకి అప్పగించమంటుందా? అన్యాయం! అక్రమం! అసలు ఆవిడే బతికిందని గ్యారంటీ ఏమిటి? ఆ శరీరంలో మరో ఆత్మ ప్రవేశించలేదని నమ్మకమేమిటి? ఆమె తిరిగి బతకడాన్ని 'లా' ఒప్పుకుంటుందా? అసలు లీగల్ పాయింట్సేమిటి? వాటిలో లొసుగులేమిటి?

హఠాత్తుగా గుర్తొచ్చినట్లు అతను తన జేబులో ఉన్న కాగితపు రోల్ అందుకుని, దానిమీద రోబొట్ ప్రింట్ చేసిన లీగల్ పాయింట్స్ చదవడం మొదలెట్టాడు ఆదుర్దాగా.

ఒక్క ముక్కలో చెప్పాలంటే అతను అచ్చం మనిషిలా ప్రవర్తించడం మొదలెట్టాడు.

* * * *

మనిషి...!

మృగావస్థలో నుంచి బయట పడి యుగం దాటినా ఇంకా మృగం కంటే హీనంగానే ఆలోచిస్తున్నాడు

ఇంకో వెయ్యేళ్ళు గడిచినా, టెక్నాలజీ వెయ్యింతలు అభివృద్ధి పొందినా,

ఇంకో బుద్ధుడూ, ఇంకో జీసస్సూ, ఇంకో ప్రవక్తా, ఇంకో గాంధీ పుట్టినా.

మనిషి ఎదుగుతాడా?

★